## చురుగ్గా కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు



బోర్లం క్యాంపు నుంచి బోర్లం వరకు వేస్తున్న బీటీ రోడ్డు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 17 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బోర్లం వరకు రూ. 1.30 కోట్లతో చేపట్టిన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గ్రామస్తులు రోడ్డును బాగు చేయాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కోరగా రెండు నెలల క్రితమే రూ.1.30 కోట్లు నిధులు మంజూరు చేయడంతోపాటు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతంగా చేపడుతుండడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

## తాళంవేసిన ఇంట్లో చోరీ

రాజంపేట్, అక్టోబర్ 17 : రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సంపత్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తలమడ్ల గ్రామానికి చెందిన చెప్యాల సాయవ్వ ఈ నెల 13వ తేదీన నిజామాబాద్‌లో ఉంటున్న తన సోదరుడి ఇంటికి వెళ్లింది. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయని, 50 తులాల వెండి, 40 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. చెప్యాల సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

భిక్కనూరు, అక్టోబర్ 17 : భిక్కనూరులోని సిద్ధరామేశ్వర ఆలయ హుండీని దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వంద రోజుల హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయ ప్రధాన మండపంలో లెక్కించగా రూ.4 లక్షల 61 వేల 889 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



మాందాపూర్‌లో దుర్గామాత వద్ద హోమం చేస్తున్న మాలదారులు, భక్తులు



దేవునిపల్లిలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి/దోమకొండ/బాన్సువాడ టౌన్/బీబీపేట్/మాచారెడ్డి/కామారెడ్డి రూరల్, అక్టోబర్ 17 : కామారెడ్డిలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శారదాదేవి ఆలయం, సంకష్టహర గణపతి ఆలయం, ఎన్‌జీవోస్ కాలనీలోని లలితా త్రిపురసుందరి ఆలయంలో మూల మంత్ర హోమం, సామూహిక నవదుర్గా మహా వ్రతం, మహా నివేదన, కుంకుమార్చన, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలోని చాముండేశ్వరీ ఆలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమూర్తిశర్మ, శరత్ చంద్రశర్మ, ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

బాన్సువాడలోని పెద్ద హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మూడో రోజు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. 56 రకాల స్వీట్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అర్చకులు అకాశ్‌శర్మ, నిర్వాహకులు నార్ల ఉదయ్ కుమార్‌గుప్తా, గంగసుధాకర్ గుప్తా, మహిళలు తదితరులు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు మాందాపూర్, యాడారం, తుజాల్‌పూర్, జనగామ తదితర గ్రామాల్లో దుర్గామాతను అన్నపూర్ణాదేవి(శాకాంబరి) అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కామారెడ్డి, మాచారెడ్డి మండలాలతోపాటు గజ్యానాయక్ తండా, మాచారెడ్డి, ఫరీద్‌పేట, పాల్వంచ, భవానీపేట గ్రామాల్లోని మండపాల వద్ద మహిళలు పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భిక్కనూరులోని జెండాగల్లీలో భారత్ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బోండ్ల సునిల్, చైతన్య, లక్ష్మణ్, శంకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

బీబీపేట్/బాన్సువాడ/దోమకొండ, అక్టోబర్ 17: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సాయిరెడ్డి అన్నారు. బీబీపేట్ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ సమీపంలో ఎస్సై సాయిరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని బీర్కూర్ చౌరస్తాలో పట్టణ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బాన్సువాడ నుంచి నిజామాబాద్, బోధన్, మహారాష్ట్రకు వెళ్లే దారుల్లో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడుపొద్దని హెచ్చరించారు.



బాన్సువాడలోని బీర్కూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## అంబారీపేటలో 120 మద్యం బాటిళ్ల పట్టివేత

దోమకొండ, అక్టోబర్ 15: దోమకొండ మండలం అంబారిపేటలో 120 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు. దోమకొండ మండలంలోని అంబారిపేటలో రంగు శ్రీనివాస్‌గౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు





కామారెడ్డిలోని రామాలయం, వికాస్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాన్సువాడ రూరల్/బీబీపేట్/కామారెడ్డి, అక్టోబర్ 17 : బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామంలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. కళాశాల ప్రాంగణంలో ప్రతిష్టించి బతుకమ్మ పాటలకు లయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, సత్యనారాయణ, విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులతోపాటు బీబీపేట్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, శివారు రాంరెడ్డిపల్లి, మాందాపూర్, యాడారం, జనగామ, కోనాపూర్, మాల్కాపూర్, తుజాల్‌పూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు అందంగా బతుకమ్మలను పేర్చి ప్రధాన వీధుల్లో పెట్టి ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

## పోచారాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న బుడ్మి సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీధర్

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 17 : బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కారు గుర్తుకు కోటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బుడ్మి సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ కార్యకర్తలను కోరారు. మండలంలోని కొయ్యగుట్టలో మంగళవారం ఏర్పాటు చేసిన 249 బూత్ లెవెల్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలు అండగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. ఈ నెల 30న బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేయనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు హకీం, భీమయ్య, ఫర్హత్ తదితరులు పాల్గొన్నారు.